సాక్షి తిరుపతి

ఆదివారం । 20 । అక్టోబర్ । 2024



రెండు బస్సులు ఢీ

రెండు బస్సులు ఎదురెదురుగా ఢీకొనడంతో ఐదుగురికి గాయాలైన ఘటన శ్రీకాళహస్తి మండలంలో చోటుచేసుకుంది. - 8లో



7 పోస్టులు.. 59 నామినేషన్లు

టీటీడీ కో–ఆపరేటివ్ బ్యాంక్ ఎన్నికల ప్రక్రియ పోటాపోటీగా సాగుతోంది. శనివారం పలువురు నామినేషన్లు వేశారు. - 8లో



ఆటోను ఢీకొన్న లారీ

కార్మికులతో బయల్దేరిన ఆటోను వెనుక నుంచి లారీ ఢీకొట్టింది. ఈ ఘటన సూళ్లూరుపేట మండలంలో చోటుచేసుకుంది. - 8లో

న్యూస్‌రీల్

స్విమ్స్‌లో పారిశుద్ధ్య నిర్వహణ భేష్



కార్మికులతో చర్చిస్తున్న జాతీయ సఫాయి కర్మచారీ కమిషన్ చైర్మన్ ఎం.వెంకటేశన్

తిరుపతి తుడా: స్విమ్స్ హాస్పిటల్‌లో సఫాయి కార్మికుల సంక్షేమ పథకాలు సక్రమంగా అమలు చేయాలని జాతీయ సఫాయి కర్మకారీ కమిషన్ చైర్మన్ వెంకటేశన్ ఆదేశించారు. శనివారం పద్మావతి మహిళా వైద్య కళాశాలలో స్విమ్స్ డైరెక్టర్ డాక్టర్ ఆర్వీ కుమార్‌తో కలసి ఆయన సఫాయి కార్మికుల సంఘాలతో సమావేశమయ్యారు. స్విమ్స్‌లో పారిశుద్ధ్య నిర్వహణ భేష్‌గా ఉందని కొనియాడారు. ఈఎస్‌ఐ, పీఎఫ్ కార్డులు ఇచ్చారా?.. జీతాలు సక్రమంగా చెల్లిస్తున్నారా? తదితర విషయాలను కార్మికులను అడిగి తెలుసుకున్నారు. వృత్తి పరంగా వారు ఎదుర్కొంటున్న సమస్యలపై ఆరా తీశారు. ఏవైనా సమస్యలుంటే 011–24648924కి తెలియజేయాలని ఆయన సూచించారు. స్విమ్స్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రామ్, ఆర్‌ఎంఓ డాక్టర్ కోటిరెడ్డి, టీటీడీ శ్రీలక్ష్మి శ్రీనివాసా మ్యాన్ పవర్ కార్పొరేషన్ జనరల్ మేనేజర్ రామ్‌కుమార్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బాలాజీ, స్విమ్స్ జనరల్ మేనేజర్ బాబు, అసిస్టెంట్ డైరెక్టర్ వీ.రాజశేఖర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, సఫాయి కార్మికులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆధార్‌తో శివయ్య దర్శనం

శ్రీకాళహస్తి: స్థానికులు ఆధార్ కార్డు చూపి నిర్ణీత సమయంలో శ్రీకాళహస్తీశ్వరుని దర్శించుకోవచ్చని ఈఓ చంద్రశేఖర్‌ఆజాద్ తెలిపారు. ఇటీవల స్థానికులు తమ ఆధార్ కార్డును తీసుకొని పీఆర్వో కార్యాలయంలో సంప్రదించి వారు ఇచ్చిన స్లిప్పు ద్వారా కంచుగడప వద్ద నుంచి వెళ్లాలని ఆంక్షలు పెట్టిన విషయం తెలిసిందే. అయితే దీనిపై పెద్ద ఎత్తున విమర్శలు రావడంతో స్పందించిన ఆలయ అధికారులు స్లిప్పునకు మినాహాయింపు ఇచ్చారు. స్థానికులు తమ ఆధార్‌కార్డును తీసుకుని ఉదయం 6 నుంచి 7.30 గంటల వరకు, సాయంత్రం 7 నుంచి 8.30గంటలకు కంచుగడప వద్ద నుంచి వెళ్లవచ్చని తెలిపారు.

నిందితులకు శిక్షపడాల్సిందే



సుబ్బరాయుడు, ఎస్పీ

తిరుపతి క్రైమ్: తప్పు చేసిన నిందితులకు శిక్ష పడాల్సిందేనని ఎస్పీ సుబ్బరాయుడు కోర్టు కానిస్టేబుళ్లకు సూచించారు. శనివారం జిల్లా కోర్టు కానిస్టేబుళ్ల, కోర్టు మానిటరింగ్ సిస్టమ్ అధికార సిబ్బందితో స్థానిక పోలీస్ పరేడ్ మైదానంలో పెండింగ్ కేసుల స్థితిగతులపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎస్పీ మాట్లాడుతూ కేసు నమోదు చేయడం.. ముద్దాయిలను అరెస్టు చేయడం.. చార్జ్ షీటు వేయడం.. ఒక ఎత్తు అయితే, కోర్టులో విధివిధానాలను సరిగా పాటించి, కేసును నిరూపణ చేయడంలో కోర్టు కానిస్టేబుళ్లదే కీలక బాధ్యత అన్నారు. దర్యాప్తు అధికారులు కేసు విచారణకు హాజరయ్యేలాగా కోర్టు కానిస్టేబుళ్లు, కోర్టు మానిటరింగ్ సిస్టం వారు బాధ్యతాయుతంగా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ వెంకట్రావు పరిపాలన, సీఐలు సుబ్రహ్మణ్యం, డీసీఆర్బీ, వెంకటప్ప కోర్టు మానిటరింగ్ సిస్టం, కోర్టు లైజన్ ఆఫీసర్లు, జిల్లాలోని కోర్టు కానిస్టేబుళ్లు, కోర్టు మానిటరింగ్ పాల్గొన్నారు.

హెవీ డ్రైవింగ్ లైసెన్స్ కోసం ఒక్కరోజు శిక్షణ

తిరుపతి అర్బన్: అలిపిరి డిపోలోని ఆర్టీసీ డ్రైవింగ్ స్కూల్‌లో హెవీ డ్రైవింగ్ లైసెన్స్ పొందడానికి శిక్షణ ఇస్తున్న సంగతి తెలిసిందే. మరోవైపు రెండు వారాల నుంచి ప్రతి బుధవారం ఒక్కరోజు హెవీ డ్రైవింగ్ లైసెన్స్ రెన్యూవల్ చేసుకోవడానికి ఇక్కడ శిక్షణ ఇస్తున్నారు. దీని కోసం రూ.1,180 చెల్లించాల్సి ఉంటుంది. హెవీ డ్రైవింగ్ లైసెన్స్ పొందిన వారు ఐదేళ్ల తర్వాత రెన్యూవల్ చేసుకోవాలి. ఇప్పటి వరకు అలిపిరి డిపో డ్రైవింగ్ స్కూల్‌లో 156 మంది వన్‌డే ట్రైనింగ్ పొందారని డ్రైవింగ్ స్కూల్ ప్రిన్సిపల్, అలిపిరి డిపో మేనేజర్ హరిబాబు తెలిపారు.



వెంకటగిరిలోని బంగారుపేట ప్రాథమికోన్నత పాఠశాలలో ఇంటి నుంచి తెచ్చుకున్న అన్నాన్ని తింటున్న విద్యార్థులు



బుచ్చినాయుడుకండ్రిగలో అసంపూర్తిగా ఉన్నత పాఠశాల భవనం

సమస్యల వెంబడి!

ప్రభుత్వ బడుల నిర్వహణను కూటమి నేతలు గాలికొదిలేశారు. అక్కడ చదువుతున్న పేద విద్యార్థులపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. పిల్లలు ఇష్టంగా తినే నాణ్యమైన మధ్యాహ్న భోజన మెనూను అటకెక్కించేశారు. నాసిరకం భోజనం, కూరలు తినలేక విద్యార్థులు పస్తులతో పొట్టలు మాడ్చుతున్నారు. భోజన కార్మికులను సైతం తొలగించి కక్షసాధింపు చర్యలకు పాల్పడుతున్నారు. పాఠశాలల మెయింటెనెన్స్ నిధులనూ విడుదల చేయక ఉపాధ్యాయులు, సిబ్బందికి నరకం చూపిస్తున్నారు. జిల్లాలోని 34 మండలాల్లో శనివారం 'సాక్షి' పరిశీలనలో పలు ఆసక్తికర విషయాలు వెలుగులోకి వచ్చాయి. జిల్లా వ్యాప్తంగా ఒకటి నుంచి పదో తరగతి వరకు 1,36,695 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తుండగా.. అందులో శనివారం ఒక్కరోజే 32,594 మంది విద్యార్థులు మధ్యాహ్న భోజనానికి దూరమవడం అక్కడి పరిస్థితులకు అద్దం పడుతోంది.

అస్తవ్యస్తంగా ప్రభుత్వ బడుల నిర్వహణ

- పైసా విదల్చని కూటమి ప్రభుత్వం
- పేద పిల్లలపై చిన్నచూపు
- మధ్యాహ్న భోజన మెనూపైనా అలసత్వమే
- ఇష్టారాజ్యంగా భోజన కార్మికుల తొలగింపు
- 'సాక్షి' పరిశీలనలో వెలుగుచూసిన నిజాలు

తిరుపతి ఎడ్యుకేషన్: గడిచిన ఐదేళ్ల కాలంలో పురోగతి దిశగా అడుగులు వేసుకుంటూ వచ్చిన ప్రభుత్వ బడులు నేటి ప్రభుత్వ పాలకుల నిర్లక్ష్యంతో తిరోగమనం బాట పడుతున్నాయి. కూటమి ప్రభుత్వం కొలువుకాగానే సర్కారు స్కూళ్ల వారి అనుసరుల కనసన్నల్లోకి వెళ్లాయి. ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు, ఆయాలను తప్పించి తమకు కావాల్సిన వారిని నియమించుకుంటున్నారు. అవకాశం ఉన్న చోటల్లా తమకు అనుకూలమైన వారికి కొలువులు ఇప్పించి ఇదివరకున్న వారిని ఇంటికి పంపించేస్తున్నారు. కొలువులు ఇప్పించడంలో ఉన్న శ్రద్ధ పాఠశాలల శుభ్రత, నిర్వహణపై ఉండడంలేదని తల్లిదండ్రులు మండిపడుతున్నారు.

మెనూ మార్పునకు రంగం సిద్ధం



వెంకటగిరి : ఇంటి భోజనమే దిక్కు

విద్యార్థులకు గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం జగనన్న గోరుముద్ద ద్వారా నాణ్యమైన, రుచికరమైన భోజనం అందించింది. ఏటా మెనూలో మార్పులు తీసుకొచ్చింది. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకంలో రుచి తగ్గిపోయింది. మెనూ ప్రకారం ఆహారం అందడం లేదు. మధ్యాహ్న భోజనం తయారు చేసే కార్మికులకు, ఏజెన్సీలకు సకాలంలో బిల్లులు చెల్లించడంలేదు. మెనూ మార్పునకు సంబంధించి ఇటీవల విద్యాశాఖ అధికారుల నుంచి నివేదికలు సైతం వెళ్లాయి.

జిల్లా సమాచారం

యాజమాన్యం	పాఠశాలల సంఖ్య	విద్యార్థుల సంఖ్య
ప్రాథమిక	1,817	47,998
ప్రాథమికోన్నత	194	13,983
ఉన్నత	323	74,689
మొత్తం	2,334	1,36,695

కాలం చెల్లిన చిక్కీలు.. నాసిరకం గుడ్లు

ప్రస్తుత ప్రభుత్వం మధ్యాహ్నభోజన పథకం పేరు మార్చి డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకంగా నామకరణం చేసింది. శనివారం వివిధ మండలాల్లో కాలం చెల్లిన చిక్కీలు, మురిగిన నాసిరకం కోడిగుడ్లు సరఫరా చేయడం .. విద్యార్థులు ఇంటి వద్ద నుంచి క్యారేజీలు తెచ్చుకోవడం కనిపించింది. మధ్యాహ్న భోజనం వండే వారు అధికార పార్టీకి చెందిన వారు కావడంతో ఉపాధ్యాయులు సైతం వారిని ప్రశ్నించే సాహసం చేయడం లేదు. టాయ్‌లెట్లకు చాలా చోట్ల తాళాలు వేసి ఉండడం, అపరిశ్రుంగా ఉండడం కనిపించింది. ఆర్వో వాటర్ ప్లాంట్లు మరమ్మతులకు గుర్తైనా పట్టించుకోని పరిస్థితి.

గతంలో రేషనలైజేషన్...ఇప్పుడు సర్దుబాటు

గతంలో టీడీపీ సర్కారు రేషనలైజేషన్ పేరుతో అనేక ప్రభుత్వ పాఠశాలలను మూసివేసింది. అదే ధోరణితో ప్రస్తుతం సర్దుబాటు ప్రక్రియను అమలు చేసి గందరగోళం సృష్టించింది. ఇష్టానుసారంగా జిల్లాలో స్కూల్ అసిస్టెంట్‌లు, ఎస్జీటీ కేడర్‌లో వందలాది మందిని సర్దుబాటు చేసింది. దీనికారణంగా దగ్గర్లో ఉన్న ఉపాధ్యాయులను 50 కి.మీ నుంచి 100 కి.మీ దూరం పంపించినట్లు తెలుస్తోంది. దాని వల్ల కౌన్సెలింగ్‌లో వారు కోరుకున్న పాఠశాలను కాదని రేషనలైజేషన్ పేరుతో దూర ప్రాంతాలకు పంపించింది. సెకండరీ గ్రేడ్ పాఠశాలల్లో 1:30 నిష్పత్తి ప్రకారం ఎక్కువ మంది టీచర్లు ఉంటే వారిని హైస్కూల్‌లో సబ్జెక్టు టీచర్లగా వర్క్ ఎడ్జస్ట్‌మెంట్ కింద పంపించింది. ఇలా ఇష్టానుసారంగా సర్దుబాటు ప్రక్రియ చేయడంతో ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో సబ్జెక్టు టీచర్ల కొరత ఏర్పడింది.

ప్రభుత్వ బడులపై చిన్నచూపు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రభుత్వ పాఠశాలలను గాలికొదిలేసింది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా అమలు చేసిన నాడు– నేడు పథకాన్ని అటకెక్కించేసింది. నాణ్యమైన మెనూను నామరూపాలు లేకుండా చేసింది. నీళ్లసాంబారు, ఉడికీ ఉడకని అన్నం, కూరలు తినలేక విద్యార్థులను అవస్థల పాలు చేస్తోంది. మరుగుదొడ్ల నిర్వహణకు పంగనామాలు పెట్టింది. తల్లికి వందనమంటూ జబ్బలు చరిచి చేతులు పైకెత్తేసింది. మద్యంపై ఉన్న శ్రద్ధ.. చదువుపై లేకపోవడం పలువురిని తల్లిదండ్రులను విస్మయానికి గురిచేస్తోంది.

కార్మికుల తొలగింపు


జిల్లా వ్యాప్తంగా వంట కార్మికులు, సహాయకులు, పారిశుద్ధ్య కార్మికులు (ఆయాలు), వాచ్‌మెన్‌లు ఉన్నారు. వీరికి జూలై నుంచి జీతాలు ఇవ్వడం లేదు. వీరిలో గత ఐదేళ్లుగా పనిచేసే వారున్నారు. 20 ఏళ్లకు పైబడి పనిచేస్తున్న వారు కూడా ఉన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత జిల్లాలో మధ్యాహ్న భోజన పథకంలో పనిచేస్తున్న కార్మికులను తీసి వేసేందుకు ప్రధానోపాధ్యాయుల చేత ఒత్తిళ్లు చేస్తున్నారు. స్వచ్ఛందంగా రాజీనామా చేయాలని బెదిరింపులకు దిగుతున్నారు. నయానో భయానో బెదిరించి ఇందులో కొంత మంది కార్మికులను తొలగించారు.



సూళ్లూరుపేట నియోజకవర్గం, దొరవారిసత్రం మండలం, నేతాజీనగర్ ప్రాథమిక పాఠశాలలో నీటి వసతి లేక తాళం వేసి టాయ్‌లెట్

మరుగుదొడ్ల నిర్వహణ గాలికి

ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్న మరుగుదొడ్లను సరిగా శుభ్రం చేయడం లేదు. దీంతో దుర్గంధం తరగతి గదుల్లోకి కొడుతోంది. శుభ్రం చేసేందుకు ప్రభుత్వం ఇవ్వాల్సిన కెమికల్స్‌ను కూడా ఇంత వరకు ఇవ్వలేదు. కొన్ని పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయులు తమ సొంత డబ్బులను వెచ్చించి అవసరమైన సామగ్రిని కొంటున్నారు. మరికొన్ని చోట్ల మనకెందుకులే అనే ధోరణితో మిన్నకుండిపోతున్నారు.





వెంకటగిరిలోని బంగారుపేట ఉన్నత పాఠశాలలో అస్తవ్యస్తంగా ఉన్న మరుగుదొడ్లు

పోరాట యోధుడు భూమన

- ప్రజలు, కార్యకర్తల సంక్షేమం కోసం ఎందాకైనా!
- విద్యార్థి దశ నుంచే పోరాటాలు చేసిన నాయకుడిగా గుర్తింపు
- వైఎస్సార్‌సీపీ చిత్తూరు, తిరుపతి జిల్లాల అధ్యక్షుడిగా భూమన నియామకం
- అధికార పార్టీలో గుబులు



భూమన కరుణాకరరెడ్డి

సాక్షి ప్రతినిధి, తిరుపతి: పోరాట యోధుడుగా భూమన కరుణాకరరెడ్డికి పేరుంది. అధికార పక్షం తప్పులను ఎత్తిచూపుతూ.. ఇటు ప్రజలు.. అటు పార్టీ కార్యకర్తలకు అండగా నిలబడుతారనే గుర్తింపు ఉంది. ఈ క్రమంలోనే ఆయన వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి దృష్టిలో పడ్డారు. భూమన కరుణాకరరెడ్డిని చిత్తూరు, తిరుపతి జిల్లాల (తిరుపతి, చంద్రగిరి, శ్రీకాళహస్తి, సత్యవేడు) అధ్యక్షుడిగా నియమించారు. భూమన నియామకం పట్ల వైఎస్సార్‌సీపీ శ్రేణులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అయితే అధికాపక్షంలో భూమన నియామకంపై తీవ్ర చర్చ జరుగుతోంది. విద్యార్థి దశ నుంచే పోరాటాల్లో రాటుదేలిన వ్యక్తిగా గుర్తింపు పొందడాన్ని గుర్తుచేసుకుంటున్నారు. ప్రజలు.. పార్టీ కార్యకర్తల పక్షాన పోరాటం చేసే విషయంలో వెనుకాడే వ్యక్తి కాదని చర్చించుకుంటున్నారు. విద్యార్థి దశలో.. ఆర్ట్ కళాశాల చైర్మన్‌గా ఉన్న సమయంలో అశ్లీల చిత్రాల ప్రదర్శన, పోస్టర్లు అంటించడంపై భూమన కరుణాకరరెడ్డి ఉద్యమించారు. ఎమర్జెన్సీ సమయంలో అరెస్ట్ అయిన వారిలో అతిచిన్న వయస్కులు భూమన కరుణాకరరెడ్డి. ఆ సమయంలో అరెస్టయ్యి 21 నెలల పాటు జైల్లో గడిపారు. ఆ సమయంలో ఎన్నో అనుభవాలు.. పలువురు మేధావులతో పరిచయాలు.. ప్రజాశ్రేయస్సు కోసం మరింతగా పోరాటం చేసేలా ప్రభావితం చేశాయని ఆయన సన్నిహితులు చెబుతుంటారు. ఆ తరువాత జనస్రవంతిలోకి వచ్చాక దివంగత మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డితో అనుబంధం నాయకుడిగా ఎదగడానికి ఎంతగానో ఉపయోగపడిందని పలు సందర్భాల్లో ఆయన వెల్లడించారు. ఆర్టీసీ కార్మికుల సంక్షేమం కోసం పోరాటం చేసిన నాయకుల్లో భూమన కరుణాకరరెడ్డి పేరు చిరస్థాయిగా నిలిచిపోయింది.

రాజకీయాల్లోకి వచ్చాక..

యాభై ఏళ్ల రాజకీయ అనుభవం ఉన్న నాయకుడిగా గుర్తింపు తెచ్చుకున్న భూమన కరుణాకరరెడ్డి కాంగ్రెస్ పార్టీలో పీసీసీ సెక్రటరీగా నియమితులయ్యారు. మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి వ్యక్తి గత కార్యదర్శిగా మన్ననలు పొందారు. వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో తుడా చైర్మన్, టీటీడీ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టి ఎన్నో చారిత్రాత్మకమైన, అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి తనేంటో నిరూపించుకున్నారు. 2012, 2019లో తిరుపతి శాసనసభ్యులుగా ఎన్నికయ్యారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో గవర్నింగ్ బాడీ, పబ్లిక్ అకౌంట్ కమిటీ సభ్యునిగా పనిచేశారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో 2023లో టీటీడీ చైర్మన్‌గా మరోమారు బాధ్యతలు చేపట్టారు. ఆ తరువాత వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కారదర్శగా నియమితులయ్యారు. తాజాగా చిత్తూరు, తిరుపతి జిల్లాల (తిరుపతి, చంద్రగిరి, శ్రీకాళహస్తి, సత్యవేడు) అధ్యక్షులుగా నియమించడంపై వైఎస్సార్‌సీపీ శ్రేణులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఉపాధ్యాయులపై పని భారం తగ్గించండి

తిరుపతి కల్చరల్: ఉపాధ్యాయులపై పనిభారాన్ని తగ్గించాలని ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు కె.రామమూర్తి ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రతిరోజూ ఏదో ఒక విషయాన్ని తెలిపి ఆ సమాచారాన్ని ఆన్‌లైన్‌లో వెంటనే అప్‌డేట్ చేయాలని చెబుతుండడంతో ఉపాధ్యాయులు ఇబ్బంది పడుతున్నారని ధ్వజమెత్తారు. తద్వారా పిల్లలకు విద్యాబోధన కష్టంగా మారిందని వెల్లడించారు. సకాలంలో సిలబస్ పూర్తి చేయలేకపోతున్నారని, ఇచ్చిన సమాచారం కూడా అస్పష్టంగా ఉండడంతో ఉపాధ్యాయులు ఆందోళనకు గురవుతున్నారని తెలిపారు. ఇచ్చిన సమాచారాన్ని సెల్‌ఫోన్ ద్వారా ఆప్‌లోడ్ చేయడం వల్ల ఇబ్బందులు ఎదురవుతున్నాయని వివరించారు. ప్రభుత్వం స్పందించి ప్రత్యామ్నా య మార్గాల ద్వారా సమాచారాన్ని సేకరించుకోవాల సూచించారు. ఉపాధ్యాయులపై యాప్‌ల భారం తగ్గించాలని విజ్ఞప్తి చేశారు. లేనిపక్షంలో పని ఒత్తిడిలో చదువుపై శ్రద్ధ చూపలేరని స్పష్టం చేశారు.

మున్సిపాలిటీల్లో పారిశుద్ధ్య చర్యలే కీలకం



సూచనలు చేస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి అర్బన్: మున్సిపాలిటీలు అంటే ముందుగా గుర్తుకొచ్చేది పారిశుద్ధ్య చర్యలు చేపట్టడమేనని కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్ తెలిపారు. శనివారం కలెక్టరేట్‌లో ఆయన జేసీ శుభం బన్సల్, తిరుపతి కార్పొరేషన్ కమిషనర్ నారపురెడ్డి మౌర్యతో కలసి మున్సిపాలిటీ కమిషనర్లతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ మున్సిపాలిటీల పరిధిలో రోజూ క్రమంతప్పకుండా పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలన్నారు. జిల్లాలో సుమారు 40శాతం జనాభా మున్సిపాలిటీల పరిధిలో నివాసం ఉంటున్నారన్నారు. మరోవైపు తాగునీరు కలుషితం కాకుండా పటిష్టమైన చర్యలు చేపట్టాలని వివరించారు. ఇటీవల కురిసిన వర్షాలతో పైపులైన్లు దెబ్బతిని ఉంటే వాటిని వెంటనే మరమ్మతులు చేయాలని ఆదేశించారు. అంతేకాకుండా నీటి శుద్ధి ప్లాంట్లు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. డంపింగ్ యార్డ్‌లపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని చెప్పారు. భూ సమస్యలు పెండింగ్‌లో లేకుండా పరిష్కరించాలని తెలిపారు. అలాగే తడి, పొడి చెత్త నిర్వహణ సక్రమంగా అమలు కావాలన్నారు. తిరుపతి మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలో సుయేజ్ ట్రీట్మెంట్ ప్లాంట్ తూకివాకం, ఎస్టీపీ ఫైటోరిడ్ టెక్నాలజీ ప్లాంట్ అంశాలపై చర్చించారు. గూడూరు, వెంకటగిరి, పుత్తూరు, శ్రీకాళహస్తి మున్సిపాలిటీ పరిధిలో చేపట్టాల్సిన అంశాలను వివరించారు. పబ్లిక్ హెల్త్ ఈఈ సుబ్బరాయుడు, శ్రీకాళహస్తి, సూళ్లూరుపేట, నాయుడుపేట, గూడూరు కమిషనర్లు గిరికుమార్, చిన్నయ్య, షేక్ ఫజురుల్లా, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఐఐటీ, ఐసర్‌తో జిల్లా విజన్ డాక్యుమెంట్

- ఐఐటీలో జరిగిన మేథోమథనంలో కలెక్టర్ వెంకటేశ్వర్



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్

ఏర్పేడు: తిరుపతి జిల్లా విజన్ డాక్యుమెంట్ తయారీకి ఐఐటీ, ఐసర్‌లు ఎంతో ఉపయోగపడతాయని కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. శనివారం మండలంలోని తిరుపతి ఐఐటీ సమావేశ మందిరంలో జేసీ శుభం బన్సల్, ఐఐటీ డైరెక్టర్ కేఎన్.సత్యనారాయణ, పలు విశ్వ విద్యాలయాల సబ్జెక్ట్ నిపుణలతో కలిసి స్వర్ణాంధ్ర 2047 తిరుపతి జిల్లా విజన్ డాక్యుమెంట్ తయారీపై కన్సల్టేటీవ్ వర్క్ షాపు మేథోమథనం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ స్వర్ణాంధ్ర 2047 తిరుపతి జిల్లా విజన్ డాక్యుమెంట్ తయారీ నేపథ్యంలో జిల్లా గ్రోత్ 15 శాతం పైగా ఉండేలా ప్రణాళిలు తయారు చేయాలన్నారు. దీనికి ఐఐటీ, ఐసర్, పలు విశ్వవిద్యాలయాల సబ్జెక్ట నిపుణల సలహాలతో అమూల్యమైనవన్నారు. విద్య, పరిశ్రమలు, మ్యానఫ్యాక్చరింగ్ యూనిట్స్ ప్రమోషన్, ఎలక్ట్రానిక్ హబ్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, లిథియం బ్యాటరీ, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటు, వెంకటగిరి చీరలు, శ్రీకాళహస్తి కలంకారీ ఎంతగానో ప్రసిద్ధిచెందినవని, తదితర అంశాలపై నిపుణులు ఇచ్చిన సలహాలు పూర్తిస్థాయిలో ఆచరణాత్మక జిల్లా విజన్ డాక్యుమెంట్ తయారు చేయాలని చెప్పారు. ఐఐటీ డైరెక్టర్ కేఎన్.సత్యనారాయణ మాట్లాడుతూ స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రాల ద్వారా పరిశ్రమల అవసరాల మేరకు నిపుణులను తయారు చేయాల్సి ఉంటుందన్నారు. అసిస్టెంట్ ప్రొఫెసర్ అరవింద్ కుమార్‌పాండే, రాహుల్ సిరోహి, చంద్రశేఖర్, హేమంత్‌కుమార్, ఉమాశంకర్, శ్రీకాళహస్తి ఆర్డీఓ భానుప్రకాష్‌రెడ్డి, జిల్లా ప్రణాళిక అధికారి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ద్విచక్ర వాహనం చోరీ



చోరీకి గురైన ద్విచక్ర వాహనం(ఫైల్)

చంద్రగిరి: ఇంటి వద్ద ఉన్న ద్విచక్ర వాహనం చోరీకి గురైన ఘటన శనివారం చోటు చేసుకుంది. బాధితుడి వివరాల మేరకు.. చంద్రగిరి కొత్తపేటలోని బ్రాహ్మణవీధికి చెందిన మునస్వామి రోజూలాగే శుక్రవారం రాత్రి తన ఇంటి వద్ద పల్సర్ ద్విచక్ర వాహనాన్ని పార్కింగ్ చేసి తాళాలు వేశాడు. శనివారం ఉదయం చూడగా ద్విచక్ర వాహనం కనిపించలేదు. దీంతో బాధితుడు స్థానిక పోలీసులను ఆశ్రయించి, ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బంగారు గొలుసు అపహరణపై కేసు

ఏర్పేడు: మండలంలోని గోవిందవరం బీసీ కాలనీలో శుక్రవారం అర్ధరాత్రి జరిగిన చోరీపై కేసు నమోదు చేసినట్లు ఏర్పేడు సీఐ జయచంద్ర తెలిపారు. గోవిందవరం బీసీ కాలనీకి చెందిన పేరం పుష్ప శుక్రవారం రాత్రి భోజనం చేసి కుటుంబ సభ్యులతో కలిసి నిద్రించింది. గుర్తుతెలియని వ్యక్తులు అర్ధరాత్రి సమయంలో పుష్ప మెడలోని సుమారు 40 గ్రాముల బంగారు గొలుసును అపహరించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు శనివారం గుర్తుతెలియని వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఆయన వెల్లడించారు.

23న ఖాళీ టిన్నులకు సీల్డ్ టెండర్లు

తిరుపతి(అలిపిరి): తిరుమల శ్రీవారి ఆలయంతో పాటు ఇతర అనుబంధ ఆలయాల్లో నెయ్యి, నూనె, జీడిపప్పు ప్యాకింగ్‌కు ఉపయోగించే ఖాళీ టిన్నుల కోసం టీటీడీ సీల్డ్ టెండర్లను ఆహ్వానిస్తున్నట్టు అధికారులు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. టెండరుదారులు 2025 మార్చి 31 వరకు ఉపయోగించిన ఖాళీ టిన్నులను తీసుకోవచ్చని పేర్కొన్నారు. సీల్డ్ టెండర్లను అక్టోబర్ 23వ తేదీ మధ్యాహ్నం 3 గంటలలోపు తిరుపతిలోని హరేకృష్ణ రోడ్డులోని మార్కెటింగ్ (వేలం) కార్యాలయంలో సమర్పించాలని సూచించారు. వివరాల కోసం, మార్కెటింగ్ (వేలం) కార్యాలయాన్ని 0877–2264429లో పని దినాల్లో కార్యాలయ పనివేళల్లో సంప్రదించాలని పేర్కొన్నారు.

ఉద్యోగ మేళాలో 43 మంది ఎంపిక



ఉద్యోగాలకు ఎంపికైన వారు

శ్రీకాళహస్తి: పట్టణంలోని ప్రభుత్వ బాలుర డిగ్రీ కళాశాలలో శనివారం రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఎంప్లాయ్‌మెంట్ ఎక్స్ఛేంజ్, సీడాప్, డీఆర్‌డీయే సంయుక్తంగా ఉద్యోగ మేళా నిర్వహించాయి. ఇందులో 92 మంది పాల్గొన్నారు. వారిని నాలుగు బహుళ జాతీయ సంస్థల ప్రతినిధులు ఇంటర్వ్యూలు చేశారు. 43 మంది ఉద్యోగాలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ శ్రీలత తెలిపారు. అధ్యాపకులు గంగారామ్, గిరిజ, గణేష్, లక్ష్మీమోహన్ పరిశ్రమల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

వాళ్లకు అలా..మాకెందుకు ఇలా?

భాకరాపేటలో కొనసాగుతున్న ఆక్రమణల పరంపర

- గత ప్రభుత్వంలో ఇంటిపట్టాలిచ్చిన లబ్ధిదారులకు నోటీసులు
- ఆక్రమించుకుని అనుభవిస్తున్న కూటమి నేతలకు వన్‌బీలు
- రెవెన్యూ అధికారుల తీరుపై మండిపడుతున్న స్థానికులు



భాకరాపేటలో అక్రమంగా పట్టాలు పొందిన భూమి



లబ్ధిదారులకు తహసీల్దార్ పంపిన నోటీసులు

భాకరాపేట: భాకరాపేట మండలంలో రెవెన్యూ అధికారుల తీరుతో స్థానికులు విసిగి వేసారిపోతున్నారు. కూటమి నేతలు ప్రభుత్వ భూములను ఆక్రమించి అనుభవిస్తున్నా పట్టించుకోని అధికారులు.. గత ప్రభుత్వం ఇచ్చిన ఇంటి పట్టాలను పునఃపరిశీలించాలని లబ్ధిదారులకు నోటీసులు ఇవ్వడం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది.

అసలు కథ ఏంటంటే?

భాకరాపేటలోని భూములకు ఇప్పుడిప్పుడే డిమాండ్ పెరుగుతోంది. చిన్నగొట్టిగల్లు, ఎర్రావారిపాళెం మండలాలకు ప్రధాన కేంద్రంగా, తిరుపతి పట్టణానికి దగ్గరగా, నాలుగు రోడ్ల జాతీయ రహదారికి సమీపంలో ఉండడంతో ఇక్కడి భూములకు రెక్కలొచ్చాయి. దీన్ని అదునుగా చేసుకుని కూటమి నేతలు అందిన కాడికి ఆక్రమించి జేబులు నింపుకోవాలని కంకణం కట్టుకున్నట్టు తెలుస్తోంది. ఇందులో భాగంగానే భాకరాపేట రెవెన్యూ గ్రామంలో సర్వే నం.329లో ఉన్న 300 ఎకరాలపై కన్ను పడింది. ఈ భూమి జాతీయ రహదారికి ఇరువైపులా ఉండడం.. అది కూడా వ్యవసాయానికి పనికి రాకపోవడంతో ఎవరికి తోచినట్టు వారు ఆక్రమించేస్తున్నారు. ఇదిలావుండగా ఇదే సర్వే నంబర్‌లో గత ప్రభుత్వం సుమారు 40 మందికి ఇంటి నివేశ పట్టాలిచ్చింది. ఒక్కో లబ్ధిదారుకు ఒకటిన్నర సెంటు చొప్పున ఇంటి పట్టా మంజూరు చేశారు. ఇందులో చాలామంది లబ్ధిదారులు ఇళ్లు కట్టుకుని నివాసముంటున్నారు. కొందరు ఆర్థిక పరిస్థితులు సహకరించక ఇంటి స్థలాలను ఖాళీగా ఉంచారు. వీరిని ఎలాగైనా ఇక్కడి నుంచి వెళ్లగొట్టాలని కూటమి నేతలు ప్రణాళిక రచించారు. అధికారాన్ని అడ్డం పెట్టుకుని రెవెన్యూ అధికారులపై ఒత్తిడి తెచ్చి అసలైన లబ్ధిదారులను గుర్తించాలని సూచించినట్టు సమాచారం. దీంతో రెవెన్యూ అధికారులు సదరు సర్వే నంబర్‌లో ఇంటి నివేశ పట్టాలున్న లబ్ధిదారులకు గతనెల 22న నోటీసులు పంపారు. లబ్ధిదారులు ఇంటి నివేశ పట్టా, ఆధారు కార్డు, రేషన్ కార్డు, కరెంటు బిల్లు, ఇంటి పన్ను రశీదు తీసుకుని విచారణకు హాజరు కావాలని సూచించారు. దీనిపై స్థానికులు రగిలిపోతున్నారు. ఆక్రమించి అనుభవిస్తున్న కూటమి నేతలకు మాత్రం వన్‌బీలు.. అసలైన లబ్ధిదారులకు నోటీసులివ్వడం ఏంటని మండిపడుతున్నారు. దీనిపై తహసీల్దార్‌ను వివరణ కోరేందుకు ప్రయత్నించగా అందుబాటులో లేరు.

క్యాంపస్ ఇంటర్వ్యూల్లో శ్రీరామ విద్యార్థుల ప్రతిభ



ఉద్యోగాలు సాధించిన విద్యార్థులతో కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు

తిరుపతి సిటీ: కరకంబాడి రోడ్డులోని శ్రీరామ ఇంజినీరింగ్ కాలేజీలో శనివారం నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూల్లో తమ విద్యార్థులు ప్రతిభ చూపారని కళాశాల డైరెక్టర్ మన్నెం అరవిందుకుమార్ రెడ్డి తెలిపారు. హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ ఎంఎన్‌సీ కంపెనీ ప్రతినిధులు కళాశాలలోని ఆఖరి సంవత్సరం చదువుతున్న విద్యార్థులను ఇంటర్వ్యూ చేశారని తెలిపారు. వార్షిక వేతనం రూ.నాలుగు లక్షలతో ముగ్గురు విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికయ్యారని వెల్లడించారు. విద్యార్థులు కోర్సు ముగించి వెళ్లేలోపు వారికి ఉద్యోగం కల్పించడమే తమ సంస్థ ముఖ్య ఉద్దేశమని తెలిపారు. ఎంపికైన విద్యార్థులను కళాశాల చైర్మన్ మన్నెం రామిరెడ్డి, సెక్రటరీ మన్నెం రామసుబ్బారెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ జయచంద్ర, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ టి విష్ణువర్ధన్ రెడ్డి, కంపెనీ ప్రతినిధి శ్రీకాంత్ అభినందించారు.

ఆటోను ఢీకొన్న లారీ



జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదం(ఇన్‌సెట్) మృతి చెందిన మునిరాజా



వైద్యశాలలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులు

- ఒకరి మృతి, ఏడుగురికి గాయాలు

సూళ్లూరుపేట రూరల్: మండలంలోని నాదేండ్లవారికండ్రిగ గ్రామం వద్ద జాతీయ రహదారిపై ఓ కంపెనీకు వెళ్తున్న కార్మికులకుల ఆటోను శనివారం లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆటో డ్రైవర్ యు.మునిరాజా అక్కడికక్కడే మృతిచెందగా, ఏడుగురికి తీవ్ర గాయాలయ్యాయి. ఎస్‌ఐ బ్రహ్మనాయుడు సమాచారం మేరకు.. దొరవారిసత్రం మండలం నుంచి అదే మండలానికి చెందిన మునిరాజా ఆటోలో రోజూ తడ మండలంలోని మాంబట్టు సెజ్‌లోని భారతీయ కంపెనీకి కార్మికులు వెళ్తుంటారు. ఈ నేపథ్యంలో శనివారం ఎనిమిది మంది కార్మికులతో ఆటో కంపెనీకి బయలుదేరింది. అదే సమయంలో నెల్లూరు వైపు నుంచి చెన్నై వెళ్తున్న లారీ ఆటోను వెనుకవైపు నుంచి ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆటో డ్రైవర్ మునిరాజా అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఆటోలో ఉన్న కార్మికులు ఉదయభాను, నిర్మాల, నీరజా, పీ.ఈశ్వరమ్మ, షకీలా, విజయలక్ష్మి, దేవికి తీవ్ర గాయాలయ్యాయి. ఎస్‌ఐ తన సిబ్బందితో ఘటనా స్థలాన్ని పరిశీలించారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. బంధువుల ఆర్తనాదాలతో ఆ ప్రాంతం దద్దరిల్లింది.

క్షతగాత్రులను పరామర్శించిన ఆర్డీఓ

స్థానిక వైద్యశాలలో చికిత్స పొందుతున్న క్షతగ్రాతులను ఆర్డీఓ కిరణ్మయి, సీఐ మురళీకృష్ణ పరామర్శించారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యాధికారులను ఆదేశించారు.

బాలిక అదృశ్యంపై కేసు

ఏర్పేడు: మండలంలోని గుడిమల్లం ఎస్సీ కాలనీలో బాలిక అదృశ్యంపై శనివారం కేసు నమోదు చేసినట్లు ఏర్పేడు సీఐ జయచంద్ర తెలిపారు. మండలంలోని గుడిమల్లం ఎస్సీ కాలనీకి చెందిన బాలిక(17) ఈ నెల 14న రాత్రి భోజనం చేసి నిద్రించింది. ఆపై 15వ తేదీ ఉదయం నుంచి బాలిక కనిపించలేదు. బంధువుల ఇళ్ల వద్ద వెదికినా ప్రయోజనం లేకపోవడంతో తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ తెలిపారు.

తిరుపతి కొర్లగుంటలో..

తిరుపతి క్రైమ్: నగరంలోని కొర్లగుంటలో నివాసం ఉంటున్న ఓ బాలిక అదృశ్యమైన ఘటన శనివారం చోటుచేసుకుంది. ఈస్ట్ సీఎస్ శ్రీనివాసులు తెలిపిన వివరాల మేరకు.. కొర్లగుంట మారుతీనగర్‌లో నివాసం ఉంటున్న శ్రీనివాసులు కుమార్తె అక్సా క్వీన్(14) సాయంత్రం నుంచి ఇంట్లో కనిపించలేదు. కుటుంబీకులు చుట్టుపక్కల గాలించినా ఫలితం లేకపోయింది. దీంతో వెంటనే ఈస్ట్ పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అయితే పాప హైదరాబాద్‌కి వెళ్లినట్లుగా పోలీసులు ప్రాథమిక విచారణలో తేలింది. సెల్ ఫోన్ అధికంగా వినియోగిస్తూ.. వాటర్ డ్రైవర్‌తో మాట్లాడినట్లుగా గుర్తించారు. బాలిక ఆచూకీ లభ్యమైతే 9440348671, 9440796748 నంబరులో సంప్రదించాలని సూచించారు.

ఎస్‌ఐ, హెడ్ కానిస్టేబుల్ సస్పెన్షన్

తిరుపతి క్రైమ్/పాకాల: పాకాల పోలీస్ స్టేషన్లో విధులు నిర్వహిస్తున్న ఎస్‌ఐ మహేష్బాబు, స్టేషన్ రైటర్ హెడ్ కానిస్టేబుల్ – 2839 మొగిలీశ్వర్‌రెడ్డిని క్రమశిక్షణ చర్యల్లో భాగంగా సస్పెండ్ చేస్తూ జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు శనివారం ఆదేశాలు జారీచేశారు. ఒక రోడ్డు ప్రమాదం కేసును నమోదు చేయకుండా అలసత్వం ప్రదర్శించి, ముద్దాయి పేరును తారుమారు చేసినట్లు వీరిపై ఆరోపణలు ఉన్న నేపథ్యంలో వారిపై క్రమశిక్షణా చర్యల్లో భాగంగా సస్పెండ్ చేసినట్టు పేర్కొన్నారు.

రెండు బస్సులు ఢీకొని ఐదుగురికి గాయాలు



ప్రమాదానికి గురైన బస్సును రోడ్డుపైకి తరలిస్తున్న క్రేన్



మెగా అధికారులకు సూచనలిస్తున్న శ్రీకాళహస్తి మోటారు వెహికల్ తనిఖీ అధికారి దమోదర్‌నాయుడు

ఏర్పేడు: మండలంలోని కొత్తకండ్రిగ సమీపంలో శనివారం రెండు బస్సులు ఎదురెదురుగా ఢీకొనడంతో ఐదుగురు గాయపడ్డారు. ఏర్పేడు సీఐ జయచంద్ర కథనం మేరకు.. తిరుపతి నుంచి పొట్టిశ్రీరాములు నెల్లూరుకు, శ్రీకాళహస్తి నుంచి తిరుపతికి వెళుతున్న బస్సులు మండలంలోని కొత్తకండ్రిగ సమీపంలో ఎదురెదురుగా ఢీకొని రోడ్డు పక్కకు ఒరిగిపోయాయి. దీంతో రెండు బస్సుల డ్రైవర్లు వీ.కుమార్(43), విశ్వనాథ్(47)కు బలమైన గాయాలయ్యాయి. ప్రయాణికులు శారద, తన్మయి, మరో ప్రయాణికుడికి స్వల్ప గాయాలయ్యాయి. వారిని శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం తిరుపతి రుయాకు తీసుకెళ్లారు. మెగా సంస్థ క్రేన్ల ద్వారా బస్సులను రోడ్డుపైకి తీసుకొచ్చారు. సమాచారం అందుకున్న శ్రీకాళహస్తి మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ దామోదర్ నాయుడు, డిపో మేనేజరు బాలాజీ అక్కడికి చేరుకుని పరిశీలించారు. ప్రస్తుతం ఈ ప్రాంతంలో ఆరులేన్ల రోడ్డు పనులు జరుగుతున్నాయని, మెగా సంస్థ యాజమాన్యం ట్రాఫిక్‌ను ఒన్‌వేలో పంపించడం, అతివేగం, దీనికితోడు వర్షం కురుస్తుండడంతో ప్రమాదం జరిగినట్లు చెప్పారు. అవసరమైన చోట రిఫ్లెక్టర్ ఏర్పాటు చేయాలని మెగా సంస్థ ప్రతినిధులను అధికారులు ఆదేశించారు.

రెండు కార్లు ఢీ



ప్రమాదానికి గురైన కారును పరిశీలిస్తున్న పోలీసులు

శ్రీకాళహస్తి రూరల్: మండలం పరిధిలోని రాచగున్నేరి సమీపంలో నాయుడుపేట–పూతలపట్టు జాతీయ రహదారిపై శనివారం రెండు కార్లు ఢీకొన్న ఘటనలో కర్ణాటకకు చెందిన భక్తులు గాయపడ్డారు. స్థానికుల కథనం.. కర్ణాటక నుంచి శ్రీకాళహస్తీశ్వరాలయానికి కర్ణాటకకు చెందిన భక్తులు రెండు కార్లలో వస్తున్నారు. రాచగున్నేరికి వచ్చేసరికి రెండు కార్లు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో కర్ణాటకకు చెందిన ఇద్దరు భక్తులు తీవ్రంగా గాయపడ్డారు. మరో ఆరుగురికి స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108 సిబ్బంది శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం తిరుపతిలోని ఓ ప్రయివేటు ఆస్పత్రికి తీసుకెళ్లారు. ప్రమాద ఘటనా స్థలాన్ని పోలీసులు పరిశీలించారు. కానీ అక్కడ ఎవ్వరూ లేకపోవడంతో వివరాల సేకరణ పనిలో పడ్డారు.

కొట్టింది ఒక్కటే!



తిరుపతిలోని కొంకచెన్నాయి గుంట చెరువులో ఆక్రమణలను తొలగిస్తున్న రెవెన్యూ ఉద్యోగులు

తిరుపతి అర్బన్: తిరుపతిలోని కొంకచెన్నాయిగుంట చెరువు పోరంబోకును ఆక్రమించుకున్నారంటూ నిర్మాణంలో ఉన్న ఒక ఇంటిని గురువారం అధికారులు తొలిగించారు. అయితే మిగిలిన ఆక్రమణల మాటేంటో...సమన్యాయం చేయాలి ఎంతటి వారైనా చెరువు పోరంబోకు స్థలాన్ని ఆక్రమంచిన స్థలాలతోపాటు నిర్మాణాలను తొలగించి స్వాధీనం చేసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. లేదంటే తాము పోరాటం చేస్తామని పలువురు హెచ్చరిస్తున్నారు. దీనిపై తహసీల్దార్ కేపీ భాగ్యలక్ష్మి వివరణ ఇచ్చారు. చెరువు స్థలాన్ని ఆక్రమించి నిర్మాణాలు చేపడితే ఊరుకోమన్నారు. ఎవరిదైనా తొలగిస్తామని ఆమె స్పష్టం చేశారు.

7 పోస్టులు.. 59 నామినేషన్లు





నామినేషన్ వేస్తున్న అభ్యర్థులు

- టీటీడీ కో–ఆపరేటివ్ బ్యాంకు ఎన్నికలకు పోటాపోటీ

తిరుపతి(అలిపిరి): టీటీడీ ఉద్యోగుల కో–ఆపరేటివ్ బ్యాంకు ఎన్నికలకు శనివారం స్థానిక టీటీడీ పరిపాలనా భవనంలో నామినేషన్ల స్వీకరణ కార్యక్రమం పోటాపోటీగా సాగింది. ఏడుగురు డైరెక్టర్ల పోటీకి శనివారం సాయంత్రానికి 59 మంది నామినేషన్లు దాఖలు చేసినట్లు ఎన్నికల అధికారి ఉమాపతి తెలిపారు. 20న సోమవారం నామినేషన్ల పరిశీలన, 21న మంగళవారం ఉపసంహరణ అనంతరం ఈనెల 28న ఎన్నికలు జరగనున్నాయి. శనివారం నామినేషన్లు వేసిన అభ్యర్థులు తమ మద్దతుదారులతో పట్టణంలో ర్యాలీ చేట్టగా.. పలువురు ఉద్యోగులు, కుటుంబ సభ్యులు సన్మానించారు.